అక్కయ్య అంతరంగం

"తక్షణం బయల్దేరి రావలెను. వివరాలు నేరులో."- వచ్చింది జాబే. తంతిగాదు. కానీ వచ్చిన జాబు తంతిలా వచ్చిన మాటమాత్రం వాస్తవం. నిజానికి అక్కయ్య ధోరణే అంత! తీరా ఉద్యోగానికి సెలవు పెట్టి, ఇంటిదగ్గర భద్రంగా వుండవలసిందని హెచ్చరికలు పలికి ఏ బస్సులోనో, రైల్లోనో వెళ్ళి జాబుకు జవాబు పలికితే ఆమె నింపాదిగా "వన భోజనానికి వెళ్తున్నాము. నువ్వుకూడా వుంటే సరదాగా వుంటుందనుకున్నాను" అని చెప్పినా చెప్పగలదు.

అవును మరి! గెజిటడ్ ఆఫీసరుగారి అర్ధాంగికి జీవితం వనవిహారంలా సుఖకరంగా తోచడంలో అబ్బురమేమీ లేదు. కానీ ఈ లోకంలో మిట్టపల్లాల డొంకదారుల్లాంటి బ్రతుకుబాటలు సైతం లేకపోలేదన్న విషయాన్ని ఆమె ఎందుకు గుర్తించదో నా కవగతం కాదు, బడిపంతులిగా నాకు యిబ్బందులుండకపోవు. కాజువల్ లీవు పూర్తి కావచ్చి వుండొచ్చు. ఇన్‌స్పెక్షన్ దరిదాపుల్లో వుండొచ్చు. పరీక్ష పేపర్లు దిద్దవలసి రావచ్చు. వీటి సంగతలా వుండగా యింట్లో శ్రీమతికో, బిడ్డలకో ఆరోగ్యం తిన్నగా లేకపోవచ్చు. కానీ అక్కయ్య అభిప్రాయం ప్రకారం యివన్నీ కుంటిసాకులు, ఆమె మ్రోల నా సంజాయిషీ మహాబధిర శంఖారావం!

అక్కయ్యతో వచ్చిన చిక్కల్లా యిదే! ఆమె లోకాన్ని రెండు వైపులనుంచీ చూడదు. ఒకవైపునుంచే చూస్తుంది. చూచినప్పుడు తనకు కనిపించిన దృశ్యమే సత్యమని భావిస్తుంది.

ఇక బావగారి సంగతి సరేసరి! గంజాయి మత్తులో బావాజీ ఒకటిగాదు, ఆయనొకటిగాదు. గుడ్డిలో మెల్లగా యించుమించు స్తబ్ధంగా పరిణమించిన ఆయన బుర్రలో వుద్యోగానికి సంబంధించిన విషయాలు మాత్రం లీలగా కదిలిపోతుంటాయి. ఆయన పదునువానకు పదరడు. పదిరితే, అయిదు నిమిషాలపాటు మన మనిషి కాడు. మెరుపులు, వురుములు, పిడుగులూ, జడివాన, ఝంఝామారుతమూ, వెరసి టీ కప్పులో తుపాను! ఐదు నిముషాల తర్వాత మళ్ళీ మామూలే - నిశ్చల నిర్వికార నిరంజన స్వరూపం!

ఆ కుటుంబంలోని వ్యక్తులు ముగ్గురు. అక్కయ్యా, బావగారూ పోనూ మూడో వాడు గోపీ. వాడు కుల ముద్ధరించటానికి తనొక్కడే చాలుననీ, తన వెనుక తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ అనవసరమని దేవుడి దగ్గర వరం కోరి వచ్చాడు. బాగా సంపాదించి పెట్టే తండ్రీ, ఆ సంపాదనను తనకోసమే పొదుపు చేసిపెట్టే తల్లీ, పుస్తకాలు చదివి పరీక్షలో కృతార్థుడు కావడానికి కావలసిన తెలివితేటలు - యివన్నీ ఆ వరానికి అనుబంధంగా వాడడిగి తెచ్చుకున్న చిన్న వరాలు! ఏ విధంగా చూసినా గోపీది కారులో షికారులాంటి జీవితం. కానైతే తారురోడ్డుపైన కారులో షికారు బయల్దేరిన వాడికి రోడ్డుకిరువైపులా వున్న దృశ్యాలు తప్పితే మిగిలిన ప్రపంచం కనిపించదు. గోపీలో ఈ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వాడు అయిదునుంచీ పదిహేనేళ్ళదాకా కాన్వెంటులో చదువుకున్నాడు.

ఆపైన హాస్టల్లో వుండి కాలేజీలో చదువుకుంటున్నాడు. అయిదడుగులా ఎనిమిదంగుళాల బక్కపలచటి మనిషి. బాగా భోజనం చేసినప్పుడుగూడా నూరు పౌన్లకు మించడు. కానీ ఈ వయసుకే వాడు చదువుకున్న వాటినన్నింటనీ ఒకచోట రాశిపోస్తే ఓ వాగను పుస్తకాలు వుంటాయి. విపరీతంగా పుస్తకాలు చదవగూడదన్నది గాదు నా అభిప్రాయం. లోకజ్ఞానం లేని గోపీని కేవలం పుస్తక పరిజ్ఞానం ఎక్కడికి తీసుకెళ్ళి వదిలి పెడుతుందన్నదే నా అనుమానం!

"సాయంకాలం వూరికి వెళ్తున్నాను జానకీ! రెండు మూడు రోజుల్లో తిరిగొచ్చేస్తాను..." అంటూ మెల్లగా ఉపక్రమించాను.

"వెళ్ళండి, వెళ్ళండి, మీ అక్కయ్య జాబు వ్రాయడమూనూ, మీరు వెళ్ళక పోవడమూనా!" అంది జానకి.

"పోనీ, నువ్వూ వస్తావా జానకీ! అందరమూ కలిసి వెళ్ళొచ్చేద్దాం" అన్నాను.

"ఎందుకూ! నన్ను రమ్మని వ్రాయలేదుగా!"

"వ్రాయకపోతే వెళ్ళగూడదన్న షరతేముంది జానకీ!"

"అప్పటికి వ్రాయకపోయినా వెళ్ళొచ్చునన్న షరతొకటి వున్నట్టు! ఏమండోయ్, ఉన్నంతలో మా బెట్టు మాకూ వుంటుందని మీ అక్కయ్యగారితో మనవి చెయ్యండి. రమ్మనకపోతే వెళ్ళము. పొమ్మనేదాకా వుండము. మర్యాదిస్తే పుచ్చుకుంటాం. లేకపోతే మీకూ మాకూ పొత్తుకుదరదంటాం."

"టాంటాం. అమ్మ యిలా గంటోందని నువ్వు అత్తయ్యదగ్గర టాంటాం చేసేయాలి నాన్నా..." అంది శారద.

"వేయనీ, వేస్తే మనకేమైనా భయమా శారదా!"

"ఎందుకోగానీ, అత్తయ్యపైన నీకు కసిగా వున్నట్టుందే అమ్మా..." ఆలోచిస్తు అంది శారద.

"అవునే శారదా! ఎలుక తనవైపుకే త్రవ్వుకోవడమంటే ఏమిటి? ఇదే!"

"నిజమే జానకీ! నిజమాడితే నిష్ఠూరమంటే ఏమిటి? ఇదే!"

రాబోతున్న నవ్వును బలవంతంగా ఆపుకుంటూ ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాను. శారద తలవంచుకుని హోంవర్కు చేసుకోసాగింది. జానకి మాత్రం ముఖం చిన్న బుచ్చుకుని చరచరా గదిలోపలికి వెళ్ళిపోయింది.

***

రాత్రి తొమ్మిది గంటలకు రైలు దిగేసరికి మందహాసాలంకృతమైన ముఖార విందంతో ప్లాటుఫారంపైన్నే ప్రత్యక్షమయ్యాడు గోపీ.

"బాగున్నావట్రా గోపీ!" అంటూ పరామర్శించాను.

"ఇంతకంటే బాగా వుండాలనే నా ప్రయత్నం మామయ్యా? కాఫీ మానేశాను, ఓవల్టిన్ను పుచ్చుకుంటున్నాను. భోజనానంతరం పళ్లు తినడం తప్పనిసరి! కానీ ఎంత చేసినా యిలాగే వున్నాను. బరువులో తేడా లేదు. పొడుగుమాత్రం ఒకటి రెండంగుళాలు పెరిగాను..." అన్నాడు గోపీ.

"నీ ఆరోగ్యానికి నీ చదువే ప్రతిబంధకంరా గోపీ! నన్నడిగితే నువ్వు రెండేళ్ళపాటు చదువు మానేయడం మంచిది" అన్నాను.

"మెల్లగా చెబుతున్నావా మామయ్యా ఆ మాట! నేను బుద్ధి తెలిసినప్పటినుంచీ చదువుతూనే వున్నాను. ఇంకా ఎన్నాళ్ళు చదవాలో తెలియడం లేదు. ఆ మాటకొస్తే పుస్తకం చేతిలో లేకుండా అయిదునిమిషాలు వూరికే కూర్చోడం నాచేతగాదు..." అన్నాడు గోపీ బుక్‌స్టాల్లో కొనుక్కున్న కొత్త పుస్తకాన్ని పాంటు జేబులో దాచేయడానికి ప్రయత్నిస్తూ.

"నువ్వు 'పొత్తమునగాక ప్రకృతిలో పుటలువిప్పి' 'చదవడం నేర్చుకోవాలిరా గోపీ! అందాకా ఈ పుస్తకాల బెడద నిన్ను వదలిపెట్టదు" అన్నాను.

గోపీ రిక్షాను పిలిచాడు. ఎక్కి కూర్చోగానే రిక్షా కదిలింది. కదిలిన రిక్షాతోపాటు గోపీ వాగ్ఝరి గూడా ముందుకురికింది. ఓ కాలేజి లెక్చరరు కోటు జేబులో పోసుకొచ్చి బఠాణీలు తినే వైనమూ, ఒకానొక ప్రొఫెసరు నల్లబల్లదగ్గర నిలబడి వ్రాయడానికి చాక్‌పీసుకు బదులుగా సిగరెట్టు పైకి తీసుకున్న విచిత్రోదంతమూ, లేబరేటరీలో సంఘటించిన ప్రేలుడుకు అదిరిపడి ఓ అమ్మాయి అబ్బాయిని కౌగిలించుకొన్న ప్రణయ సన్నివేశము - యిత్యాది వృత్తాంతాలను గురించి చెప్పుకపోతున్నాడు గోపీ.

ఇల్లు చేరువకు వస్తోంది.

"నిల్చున్న పాళంగా నన్నిలా రమ్మని జాబు వ్రాయడంలో మీ అమ్మగారి ఆంతర్యమేమిటో నీకు తెలియదా గోపీ?" అన్నాను.

"అబ్బే, నాకేం తెలుసు మామయ్యా! సస్పెన్సు మెయిన్‌టెయిన్ చేయడంలో అమ్మకు అమ్మే సాటి..." అన్నాడు గోపీ.

రిక్షా యింటి ముంగిట తోటలో ఆగింది. అక్కా బావా దేవియుం దేవరలులాగా గృహ ప్రాంగణంలోనే ఎదురయ్యారు.

"కులాసాయేనా చలపతీ!" బావగారు పలకరింపుతో కలిపి చిరునవ్వు చిలకరించారు.

వేడినీళ్ళ స్నానమూ, వేడి వేడిగా భోజనమూ ముగిసిన తర్వాత అక్కయ్య నన్ను వరండాలోకి తీసుకెళ్ళింది. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్న తర్వాత "నువ్వు వేణుమాధవరావుగారిని ఎరుగుదువా" అంటూ హఠాత్తుగా అసలు విషయంలోకి వచ్చేసింది.

"ఇంజనీరు వేణుమాధవరావుగారినేనా అక్కయ్యా! తెలియకేం! ఆయనకూ మనకూ ఏదో దూరపు బంధుత్వంగూడా వుండాలికదూ..." అన్నాను.

"దూరపు బంధుత్వమేమిటి? రాకపోకలు మానేశాం గనుక దగ్గర బంధువులు గూడా దూరపు వాళ్ళుగా కనిపిస్తున్నారు. ఆయన, స్వయానా మీ బావగారి పెదతండ్రికి అల్లుడు, ఇటుమన తాతగారూ, మాధవరావుగారి నాన్నగారూ పెత్తల్లీ, పినతల్లి బిడ్డలు. ఇప్పుడు చెప్పొచ్చిందేమిటంటే ఆ వేణుమాధవరావుగారి రెండో కూతురికి ఎల్లుండి తెల్లవారు జామున పెళ్ళి. నువ్వు వెళ్ళి రావాలి..."

"ఇది మరీ బాగుందక్కయ్యా! కనీసం ఆ పెళ్ళి సంగతైనా నాకు తెలియదు. ఆ పిలువని పేరంటానికి వెళ్ళడానికేనా నాకీ తంతిలాంటి పిలుపు..." అంటూ తెల్లబోయాను.

"నువ్వు నీ పనికోసం వెళ్తున్నావు. ఆ పెళ్ళికోసం కాదు..."

"అంటే?"

ఆ వేణుమాధవరావుగారికి యింకా ఒక పెళ్ళికావలసిన కుమార్తె వుంది..."

"ఉండొచ్చు. ఉంటుందికూడా..."

"మధ్యలో అడ్డు తగలొద్దు చలపతీ! తీరా చెప్పేదంతా విను, సదరు వేణుమాధవ రావుగారి తమ్ముడు భుజంగరావుగారింట్లో గిరిజ, వనజ అని యిద్దరు పెళ్ళి కావలసిన అమ్మాయిలున్నారు..."

"హరేరాం! ఇవేనా అక్కయ్యా నువ్వు నేరులో చెప్పదలచుకున్న వివరాలు?"

"ఇంకా వున్నాయి! ఆ భుజంగరావుగారి తోడల్లుడొకాయన వున్నాడు, ఆదిశేషయ్య గారని! ఆ ఆదిశేషయ్యగారికిగూడా పెళ్ళికి సిద్ధంగా వున్న కూతుళ్ళొకరిద్దరున్నారు. కానీ వాళ్ళందరూ ఆ విధంగా వారి వారి తల్లిదండ్రులకు కూతుళ్ళై వుండడంకాదు విశేషం. అందరూ ఈ పెళ్ళికొక చోట చేరబోతున్నారు చూచావూ, అదే విశేషం!"

"ఈ విశేషాన్ని మరికొంచెం విశ్లేషించి చెప్పలేవా అక్కయ్యా!"

"వెళ్తున్న వాడివి నువ్వక్కడ కాస్త మెలకువగా వుండి ఆ అయిదారుగురు అమ్మాయిల్లోనూ మన గోపీకి నచ్చే పిల్ల ఎవరో కనిపెట్టాలి..."

"కానీ గోపీ ఎక్కడుంటాడక్కయ్యా?"

"ఎక్కడుంటాడు! వాడూ నీతోబాటే పెళ్ళికొస్తున్నాడు..."

"ఐతే ఇదంతా పెళ్ళిచూపుల తతంగమన్నమాట!"

"ఒక విధంగా పెళ్ళి చూపులేననుకో! కానీ ఇందులో సౌకర్యాలు చాలా వున్నాయి. ఒక్కొక్క వూరికివెళ్ళి ఒక్కొక్క అమ్మాయినే చూడ్డానికి మొదలెడితే ఈ మూడు నాలుగూళ్లూ తిరిగి రావడానికి ఎంతలేదన్నా పదిరోజుల విరామం కావలసొస్తుంది. తీరా వెళ్ళి చూచిన తర్వాత ఆ చూచిన అమ్మాయి నచ్చలేదని చెప్పవలసి వస్తే ఎదుటివాళ్ళకు ఆశాభంగం కలుగుతుంది. ఎందుకొచ్చిన బెడద! మొదట పిల్ల మనకు నచ్చితే ఆ తరువాత ఆ పెళ్ళిచూపుల ఆనవాయితీ గూడా జరిగిందంటే జరిగిందనుకుని, పెళ్ళికి ముహూర్తం పెట్టుకోవచ్చు..."

"ఐతే గోపీ పెళ్ళి సమీప భవిష్యత్తులోనే వుందంటావా అక్కయ్యా?"

"అవున్రా తమ్ముడూ! అవును. పిల్లలు నోరు తెరచి అడగరు. కానీ వాళ్ళపట్ల మన బాధ్యతల్ని సక్రమంగా, సకాలంలో నిర్వర్తించవలసిన కర్తవ్యం మనపైన వుంది..." అంది గంభీరంగా అక్కయ్య.

తాంబూలం నములుతూ మేడపైకి వెళ్లాను. గోపీ వాలుకుర్చీలో పడుకుని ఒకటి రెండు గంటలకు మునుపు తను స్టేషనులో కొనుక్కున్న "మోహం" నవలలో అయిదో ప్రకరణం చదువుతున్నాడు.

"నీకు మీ అమ్మ పెళ్ళి చేయబోతోందిరా గోపీ" అన్నాను, వాడిని హఠాత్తుగా వుక్కిరి బిక్కిరి చేయాలనుకుంటూ!

"అలాగా మామయ్యా! ఇలాటిదేదో జరగొచ్చునని నేనూ అనుమానిస్తూనే వున్నాను..." అన్నాడు ముభావంగా గోపీ.

"ఐతే నీ పెళ్ళిని గురించి నీ యిష్టాయిష్టాల ప్రసక్తి ఏమీ లేదన్నమాట!"

"ఇష్టం లేకపోయినా తప్పించుకోడానికి వీల్లేని బంధాల్లో పెళ్ళి ఒకటి కద మామయ్యా నీకు తెలియందేముంది?" అంటూ గోపీ నా ముంగాళ్లకే బంధం వేసేశాడు!

***

పెళ్ళి అన్న పేరుతో కొట్టి కోలాహలం చేసేస్తున్నారు వేణుమాధవరావుగారు. వీధి పొడుగునా పందిరి వేయించారు. గుంజ గుంజకూ మెర్క్యురీ దీపం పెట్టించారు. పువ్వులతో పల్లకీ జోడించారు. దక్షిణాదినుంచీ బ్యాండుమేళం రప్పించారు.

"ఇదేమిటి మామయ్యా! ఇక్కడ మాయాబజారుకోసం సెట్టువేశారేమిటి?" అంటూ విస్తుపోయాడు గోపీ.

పచ్చని కొబ్బరి మట్టల సువాసన నాఘ్రాణిస్తూ పందిరి క్రిందనుంచీ, పెళ్లి విడిదిలోకి వెళ్ళేసరికి చేమంతి పువ్వుల పరిమళం ఎదురై వచ్చి బరాబరులు పలికింది. కన్నెపడుచులు కొందరు జడలల్లుకుంటున్నారు. ముత్తయిదువులు కొందరు కంబాల చాటున నిల్చుని తమ తమ మగవాళ్ళకోసం నిరీక్షిస్తున్నారు. తల్లుల కొంగుల్ని పట్టి లాగుతూ పసిపిల్లలు కొందరు తమకేదో కావాలని గోలపెడుతున్నారు.

"మనం డాబాపైకి వెళ్దామా మామయ్యా!" అన్నాడు గోపీ.

డాబాపైనగూడా అలజడి తక్కువగా లేదు. కానైతే సందడిలో అక్కడికి యిక్కడికీ వైవిధ్యం మాత్రం కనిపించింది. ఓ వైపున పేకాట రసవత్తరంగా సాగిపోతోంది. మరో వైపున సిసింద్రీల్లాంటి కుర్రాళ్లు కొందరు బొగ్గుతో పట్టెగీసి 'చెడుగుడు' మొదలెట్టేశారు. ఇంకోవైపున భారీ ఎత్తున రాజకీయాలపైన చర్చలు కొనసాగుతున్నాయి. ఇంత గలభా చాలదన్నట్లు నల్లగా, కుదిమట్టంగా వున్న ఓ నడిప్రాయపు పెద్దమనిషి ఏకాంత ప్రదేశంలో ప్రకృతి సౌందర్యాన్ని చూచి పులకించిపోయి అప్రయత్నంగా గొంతు విప్పి పాడుకుంటున్న గాయకుడిలా పిట్టగోడకు చేరగిలపడి తారాస్థాయిలో రాగాలాపన సాగించేస్తున్నాడు.

"చూచావా మామయ్యా! ఇంతమందిలోనూ మనకు సొసైటీ అంటూ ఒకటి లేకపోయింది" అన్నాడు గోపీ.

'మనకు' అని నన్నుగూడా కలుపుకోకు గోపీ. నువ్వు కుర్చీలోనైతేగానీ కూర్చోలేవు. తెలిసినవాడొకడు వచ్చి తెలియనివాడిని పరిచయం చేసిపెట్టేదాకా, అతడితో మాటలు కలుపుకోలేవు. పోనీ, మాట్లాడకుండా ఒకచోట పడుకోగలవంటేనా, అందుకైనా నీకు ప్రత్యేకంగా ఓ గది కావాలి. పైగా ఒక పడక కావాలి. నీకు నీ హాస్టలుగదిలోనూ, స్వంత యింటిలోనూవున్న సదుపాయాలన్నీ ఈ పెళ్ళి విడిదిలో ఎలా సమకూరగలవు చెప్పు..." అంటూ మా వాడిని సముదాయించడానికి పూనుకున్నాను.

"ఐతే నేను సొసైటీకి అనర్హుడినంటావా మామయ్యా?" దిగులు పడిపోతూ అడిగాడు గోపీ.

చెప్పగూడదుగానీ పిల్లిని చంకనపెట్టుకుని పెళ్ళికి వెళ్ళినట్టయింది నా పని! పెళ్ళిళ్ళలో వేళకు సరిగ్గా భోజనాలు వడ్డించడం అరుదు. ఎనిమిదిన్నరకు పైగా తొమ్మిదిన్నరకులోగా గోపీ చేతిగడియారాన్ని వందసార్లయినా చూచివుంటాడు. ఆ తరవాతనైతే వాడు ఆకలో ఆకలి అంటూ నోరే విడిచేశాడు. ఎలాగైతేనేం, పదికొట్టగానే

భోజనాలకు పిలిచారు. అందాకా అన్నమో రామచంద్రా అంటూ బిట్టువాపోయిన గోపీ ఒక మైసూరు పాకులో సగం మాత్రం తిని, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని రెండు లోటాల మంచినీళ్ళు త్రాగి అంతటితో ఆకు మడతపెట్టి బంతిలో ఆదరాబాదరాగా ఖాద్య పదార్థాలను మటుమాయం చేస్తున్న వాళ్లకేసి ఆశ్చర్యంగా చూడసాగాడు. భోజనం ముగిసింది గనుక కాసేపు నిశ్చింతగా వుండవచ్చుననుకున్నానుగానీ, ఆ ఆశగూడా అడియాసే అయింది. చేయి కడుక్కోగానే తనకొక ఖాళీజాగా చూపించమన్నాడు గోపీ, పడకలేకపోయినా పరవాలేదులెమ్మన్నాడు. ఓ ముసలాయనను బ్రతిమాలుకుని, కూర్చున్నచోటునుంచీ ఆయనను లేపి ఓ చిన్న అరుగు ఖాళీ చేయించాను. నిద్రచోటెరుగదు కావాలి! పడుకున్న అయిదు నిమిషాలకే గోపి నిద్రాపరవశుడై పోయాడు.

ఆ అమూల్యావకాశాన్ని వృధా పోనివ్వకుండా నేను పెళ్లివారిలో కలిసిపోయాను. పీటలపైన వధూవరులకు నలుగులు జరుగుతుండగా, కాబోయే పెళ్ళికూతుళ్ళెవరో ఆరాతీశాను. వాళ్ళ వాళ్ళ విద్యా యోగ్యత లెలాటివో వాకబు చేశాను. మొదట తల్లితండ్రుల గుణగణాలెలాంటివో కూపీతీసి, పందిరి క్రింద తిరుగుతున్న అమ్మాయిల హావభావాలను బట్టి వాళ్ళ గుణగణాలను ఎంతవరకూ పుణికిపుచ్చుకున్నారో వూహించదానికి ప్రయత్నించాను. గంట రెండు కావస్తోంది. వధూవరులు స్నానాలకు లేచారు. బంధువులందరూ ఒక నిద్రపోయి లేవడానికి వీలుగా ఎక్కడివాళ్ళక్కడే మేను వాల్చేశారు.

తెల్లవారుజామున మేళం మ్రోగగానే గోపీలేచి కూర్చున్నాడు. పెరట్లోకి తీసుకెళ్ళి ముఖం కడిగించి, వంట బ్రాహ్మణ్ణి మాలీసు చేసి ఒక కప్పు కాఫీ పుట్టించి మా వాడిని మళ్ళీ మామూలు మనిషిగా చేయగలిగాను. పందిరిలోకి వచ్చేసరికి పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు.

"కాస్త దగ్గరగా కూర్చుని పెళ్ళంతా సాంగోపాంగంగా చూడాలి మామయ్యా" అంటూ తన వుబలాటాన్ని వెలిబుచ్చాడు గోపీ.

"దానికేం గోపీ! అందరికంటే ముందుగా పెళ్ళిపీటపైన్నే కూర్చోవచ్చు. కానీ అందుకు మొట్టమొదట గంతకుతగిన బొంతను ఎన్నుకోవాలి. అదిగో, పెళ్ళికూతురికి కుడివైపున పావడాపైన ఓణీ వేసుకుని నిల్చుంది చూడు, ఆమెగారే సంధ్య, వేణు మాధవరావుగారి మూడోకూతురు..." అన్నాను.

"అలాగా మామయ్యా! ఆవిడేనా సంధ్య? వేణుమాధవరావుగారి మూడో కూతురు!" చేజారిపోయిన పెన్నిధి హఠాత్తుగా చేతికి దొరికినంత సంభ్రమాన్ని ప్రకటించాడు గోపీ!

"అదేమిటి గోపీ! నువ్వీ సంధ్య అన్న అమ్మాయిని గురించి యింతకుమునుపే విన్నావేమిటి?"

"అబ్బే, అదికాదు మామయ్యా! నువ్వీ అమ్మాయిని గురించి యింతగొప్పగా చెబుతుంటే నేనామాత్రం వుత్సాహమైనా కనబరచకపోతే ఏం బాగుంటుంది?" అన్నాడు నెమ్మదిగా గోపీ.

నాకో సందేహం కలిగింది. వీడుగానీ నన్ను ఏడిపించాలనుకోవడంలేదుగదా! దీన్నేమనుకోవాలి? అభినయమా, లేక అమాయకత్వమా?

వాడి ధోరణి సంగతలావుంచి నాపాటుకు నేను చెప్పుకపోసాగాను. "అమ్మాయి స్కూలు ఫైనలు పాసై పియుసి చదువుతోంది. చక్కగా పాడుతుంది. నిక్కచ్చిగా మాట్లాడేస్తుంది. ఇంకో ముఖ్య విషయం రా గోపీ! విశ్వసనీయ వర్గాలద్వారా తెలిసింది. ఈ అమ్మాయిల రన్నింగ్ రేసులో వాళ్ళ కాలేజికంతా ఫస్టుగా వచ్చి ఓ వెండి కప్పు సంపాదించిందట!"

ఉన్నట్టుండి ఆలోచనలో పడిపోయినట్టు కనిపించాడు గోపి. ఒకటి రెండుసార్లు కదిపిన తర్వాత భావ పారవశ్యంలోనుంచీ తేరుకున్నట్టు "మరేంలేదు మామయ్యా! ఓ వర్ణన జ్ఞప్తికి వచ్చింది. చీకటిలాంటి కృష్ణుడు సంధ్యా సుందరిలాంటి రాధను వెన్నంటి తిరుగుతుంటాడట! ఎంత వేగంగా పరుగెత్తినా రాధ చివరకు కృష్ణుడికి దొరికిపోక తప్పదట! ఆ తరువాతేముంది? వెన్నెల్లాంటి వాళ్ళ ప్రణయం లోకమంతటా వ్యాపిస్తుందట! మరి యిక్కడేమో, ఈ సంధ్యకూడా కాలికొద్దీ పరుగెత్తగలదని చెబుతున్నావు. ఈమెను కట్టుకున్న మానవుడు ఆ వేగాన్ని అందుకోలేకపోతే ఏం కావాలి?"

గడ్డు ప్రశ్నేమరి! ఎలాగైనా మావాడి తెలివితేటలు గొప్పవి. అవి సందేహాలను సృష్టిస్తాయి. సమస్యలను పరిష్కరించవు!

"పోనీ, యింకొక అమ్మాయిని చూపించలేవా మామయ్యా!" అన్నాడు గోపీ దాదాపుగా నన్ను బుజ్జగిస్తున్న వాలకంతో.

"ఎందుకు చూపించలేను! అదిగో, ఆ ముసలావిడకు దగ్గరగా కూర్చుంది చూడు, తెల్లటి చీర, నిడుపాటి జడ, దీపంలాంటి బొట్టు – ఆ అమ్మాయి పేరు గిరిజ. భుజంగరావు గారి పెద్ద కూతురు...?

"మోకాళ్ళకు ముఖం ఆనించుకుని చెంపకు చేరడేసిగావున్న కళ్ళతో వధూవరులను చూస్తున్న అమ్మాయేనా మామయ్యా?"

"ఆమెలోగూడా ఏదైనా వంక కనిపెట్టాలనుకుంటున్నా వేమిట్రా గోపీ!" అంటూ అనుమానంగా వాడివైపు చూచాను.

"వంక కోసంగాదు మామయ్యా! భుజంగరావుగారి అమ్మాయని చెప్పావు కాబట్టి సరిపోయిందిగానీ, లేకుంటే నేనామెను చలువరాతితో చెక్కిన శిల్పమనుకునేవాణ్ణి! ముఖ్యంగా ఆ కళ్ళు మామయ్యా! 'కాటుక కళ్ళలోన ఆలోచనలేమిటే హరిణలోచని' అన్న భావానికి రూపకల్పనగా లేదూ?"

"ఉందో లేదో చెప్పలేనుగానీ, నేను చెప్పగలిగిన విషయమొకటేరా గోపీ! భుజంగరావుగారికి ముగ్గురు కూతుళ్ళు. కొడుకులు లేరు. లక్ష రూపాయల ఆస్తి లక్షణంగా వున్న అమ్మాయి. ఆ తరువాత నీ యిష్టం..."

గోపీ కాసేపు మౌనంగావుండిపోయాడు. కానీ ఆ మౌనాన్ని అర్ధాంగీకార మనుకోడానికిగూడా వీల్లేకపోయింది. ఎందుకంటే వాడి చూపులిప్పుడు చలువరాతి శిల్పంలాంటి అమ్మాయిపైన లేవు. అవిప్పుడు జరీ అంచు వచ్చిన నీలి రంగు చీరకట్టుకుని నడుముకు బంగారు వడ్డాణం బిగించి, జడపొడవునా పువ్వులు పెట్టుకుని విలాసంగా గుంజను ఆనుకుని నిల్చున్న ఓ అమ్మాయి చుట్టూ తారట్లాడుతున్నాయి.

"ఆ అమ్మాయిపేరు ఇంద్రాణి" అన్నాను.

గోపీ ఉలికిపడినట్టు కనిపించాడు. వెంటనే ఆ తొట్రుపాటును సవరించుకోదలచిన వాడిలా "రంగారోహణ చేయబోతున్న నర్తకిలా కనిపించడంలేదా మామయ్యా!" అన్నాడు.

"లేదంటే కళ్ళు పోవట్రా గోపీ! ఆమె ఆదిశేషయ్యగారమ్మాయి. హైస్కూల్లో చదువుకుంటోంది. చదువుకంటే లలితకళలంటే చాలా యిష్టం. అందులోనూ నాట్యమంటే చాలు, నిద్రాహారాలు మానేస్తుంది."

ఏదో ఆంతరంగికమైన అభిప్రాయం చెప్పబోతున్నవాడిలా దగ్గరికి జరిగి కూర్చున్నాడు గోపీ. "పట్టణంలో ఒకాయనున్నాడు మామయ్యా! పామిస్ట్రీలో నిధి! ఆయన ఏమన్నాడో తెలుసా! నా చేతిని చూచి నీ పెళ్ళాం నర్తకిగా పెద్ద పేరు సంపాదిస్తుంది. అలా జరక్కపోతే నా సాముద్రిక శాస్త్రం కాల్చేస్తానన్నాడు..."

నాకు నవ్వాలో ఏడవాలో తోచింది కాదు. నేను వాడికి వరుసగా ముగ్గురమ్మాయిల్ని చూపించాను. వారిలో ఏ ఒక్కరి పట్ల వీడు స్పష్టంగా సుముఖతనో, విముఖతనో కనబరచిన సూచనలు లేవు. అక్కయ్య నన్ను గొప్ప కుశాగ్రబుద్ధిగా భావించింది. ఏం లాభం! నేనే కుర్రకుంక యింగిత మేమిటో కనిపెట్టలేకపోయాను.

ఈ నా అసమర్థతను అక్కయ్య దగ్గర దాచిపెట్టుకోవలసిన అవసరమేమీ నాకు కనిపించలేదు. ఆమెగారి కుమారుడి మనస్తత్వం నాకు బొత్తిగా అర్థం కాలేదని వీలైనంత స్పష్టంగా నా అభిప్రాయాన్ని వెల్లడించుకున్నాను.

అక్కయ్యకెందుకో చెప్పరానంతకోపం వచ్చింది. ఆమె రుసరుసలాడుతూ "మీరు మామా అల్లుడూ కలిసి ఏదో గూడుపుఠాణీ చేస్తున్నారల్లేవుంది" అంటూ విసవిస నడిచిపోయింది.

ఇందులో గూడుపుఠాణి ఏమిటో ఆ దైవానికే తెలియాలి! నామట్టుకు నాకు అదొక అర్థంపర్థంలేని మాటలా గోచరించింది.

స్వాగతమివ్వడానికి వచ్చినట్టే సాగనంపడానికిగూడా గోపీ స్టేషనుదాకా వచ్చాడు. నేను రైల్లో కూర్చున్నాను. వాడు ఫ్లాట్‌ఫారంపైన నిల్చున్నాడు.

చివరి ప్రయత్నం ఒకటి చేయడంలో తప్పేమీ వుండదనిపించింది. "ఐతే ఆ ముగ్గురమ్మాయిల్లో నీకొక్కరుగూడా నచ్చలేదట్రా గోపీ" అంటూ నిలదీసి అడిగాను.

గోపీ నా అమాయికతకు జాలిపడుతున్న వాడిలా వెకిలిగా నవ్వేశాడు. "నీకు చెప్పని రహస్యమేముంది మామయ్యా! తనమాట లేకుండా నా అంతట నేనే పెళ్ళి ప్రయత్నాలకు పూనుకున్నానని తెలిస్తే అమ్మ మండిపడుతుందని నాకు తెలుసు... ఆ అమ్మాయి మా కాలేజిలోనే చదువుకుంటోంది. పేరు రజని. చాలా మంచిది! సంధ్యలా చక్కగా పాడుతుంది. గిరిజకున్నట్టే ఆస్తిపాస్తులున్నాయి. ఇంద్రాణికిమల్లే నాట్యంగూడా చేస్తుంది..."

ఇంతలో రైలు కదిలింది. వెలవెల పోతున్న నా ముఖాన్ని చూసి గోపీ లోలోపలే నవ్వుకున్నాడేమో నాకు తెలియదు. ఇంతత్వరగా గోపీ యిలా ప్రయోజకుడు కాగలడని నేను కలలోనైనా అనుకోలేదు. ఇందుకే కావచ్చు వసంతం రాగానే కోయిల కోయిలగా బయటపడి పోతుంటుందని చెబుతారు పెద్దలు!

***

ఒకటి రెండు మాసాలు గడచిపోయాయి. పరీక్షలు దగ్గరలోనే వున్నాయి గనుక బాగా చదువుకోవాలని చెప్పి సెలవులు పూర్తిగాక మునుపే గోపీ కాలేజికి వెళ్ళిపోయినట్లు అక్కయ్య జాబు వ్రాసింది. ఈ 'బాగా చదువుకోడానికి' ప్రణయానికి సంబంధించిన పరిభాషలో అర్థమేమిటో గోపీనడిగి తెలుసుకోవాలనుకున్నాను. కానీ యిలాంటి విషయాలు తెలిసినా, తెలియనట్టు వూరుకోవడం మంచిదనిపించింది. అది మన పెద్దరికానికి ఆరోగ్యకరమైన పద్ధతి!

ఓరోజు ఉదయం మార్కెట్టుకు వెళ్ళి తిరిగి వచ్చాను. బావ వ్రాసిన ఉత్తరం అంటూ శారద నా చేతికో కవరందించింది.

ఎప్పుడైనా గాలి మళ్ళినప్పుడు ముచ్చటగా మూడు ముక్కలు గిలికి ఓ కార్డు పోస్టుచేయడం గోపీ వాడుక. అలాంటి వాడిచేత ఈపాటి పొడుగైన ఉత్తరం వ్రాయించగలిగిన పరిస్థితులెలాంటివై వుండవచ్చునన్న విస్మయంతోనే కవరు చించి, కాగితం విప్పాను.

"ప్రియమైన మామయ్యా!" మామూలు సంబోధనతోనే ఉత్తరం ప్రారంభమైంది. కానీ ఆ తరువాత లేఖాంశాలవైఖరి మాత్రం, మామూలు ధోరణికి విభిన్నంగా పరుగెడుతోంది.

"నేను మూర్ఖుణ్ణి. నాకు బొత్తిగా లోకజ్ఞానం లేదు. నువ్వు మాటిమాటికి చెబుతూ వచ్చిన మాట అక్షరాలా నిజం! లేకుంటే ఆ రజని అన్న అమ్మాయి విషయంలో నేనిలా బోల్తా కొట్టేవాణ్ణి కాను.

ఏం జరిగిందో తెలుసా మామయ్యా! సెలవుల్లో ఆ అమ్మాయికి పెళ్ళి జరిగి పోయింది. ఇప్పుడావిడ ఈ ప్రాంతంలో ఎక్కడా లేదు. హనీమూన్ గడిపి రావడానికి మొగుణ్ణి వెంట తీసుకుని మైసూరు వెళ్ళిపోయింది.

నేనెలాంటి అవివేకినో చూచావా మామయ్యా! ఎండమావిలో నీళ్ళుంటాయని భ్రమించిన అజ్ఞానం నాది. తెలివి తెచ్చుకుని చెంపలు వేసుకోవడంకన్నా నేనిప్పుడు చేయదగిందేమీ లేదు.

పోగా యిటీవల మనం చూసివచ్చిన ముగ్గురమ్మాయిల్లో ఎవరైనా నాకిష్టమే! ఈ ఎన్నికలో మళ్ళీ ఒకసారి నా తెలివితక్కువతనాన్ని బయటపెట్టదలచుకోలేదు. చాయిస్ నీకే వదిలేస్తున్నాను. నువ్వు కట్టమన్న అమ్మాయి మెడలో బొట్టు కట్టేయడానికి నేను తయార్..."

జాబు చదివిన తర్వాత నాకు కలిగిన భావాన్ని యిదమిత్థమని తేల్చి చెప్పడం కష్టం. ఆ క్షణాన గోపీ గనుక నా ఎదుటవుండినట్టయితే నేను వాడి చెవులు గట్టిగా మెలిపెట్టి వుండేవాణ్ణి! ఐతే ఈ శిక్ష గోపీ తన ప్రణయ వ్యవహారంలో తల్లక్రిందులయి నందుకుగాదు. గోడకుర్చీ కూర్చోబెట్టి తొడపాశం వేసి గురువు నేర్పించిన పాఠంలా ఆ సంఘటన వాడికి నేర్పించిన గుణపాఠమే చాలు. అది వెయ్యి శిక్షల పెట్టు. ప్రస్తుత విషయం నేను వాడికొక పెళ్ళాన్ని ఎన్నికచేసి పెట్టడం! పెళ్ళంటే హోటలుకు వెళ్ళి ఓ కప్పు కాఫీ సేవించడంగాదు. పెళ్ళంటే బంకులో ఓ సిగరెట్టు కొనుక్కుని కాల్చి పారేయడం

గాదు. అది నూరేళ్ళ పంట! తొందరపడి చేతులు కాల్చుకుంటే తరువాత అది ఆకులు పట్టుకున్నా లాభంలేని తంటాగూడా! ఒకానొక గ్రంథానికి పీఠిక వ్రాస్తూ విజ్ఞుడొకాయన ఈ పుస్తకం నీకిప్పుడు అర్థం గాపోతే యింక పదేళ్ళు గడచిన తర్వాత చదవమన్నాడు. ఆ పదేళ్ళ జీవితానుభవం ఈ పుస్తకాన్ని చదివి అర్థం చేసుకోడానికి తోడ్పడవచ్చునన్నదే ఆ వాక్యానికి వ్యాఖ్యానం. నీ జీవితంలో పాలుపంచుకుని నీతో చెట్టాపట్టాలు వేసుకుని నడవగల సహచారిణి ఎవరో నువ్వు తెల్చుకోలేని పక్షంలో నువ్వు నీ పెళ్ళి ప్రయత్నాన్ని కొంతకాలంపాటు వాయిదా వేయడం మంచిది. అంతేగానీ ఎవరో చెబుతున్నారనీ, మరెవరినో సంతృప్తిపరచడానికినీ ఓ అమ్మాయి మెడలో మంగళసూత్రాన్ని ముడివేయడానికి సిద్ధపడడం ఈత తెలియకుండా నీళ్ళలో దిగడంలాంటిది!

ఈ అభిప్రాయాన్నే మరికొంచెం విశదీకరిస్తూ గోపీకి ఉత్తరం వ్రాసి పోస్టు చేశాను.

పది పదిహేను రోజుల్లో ప్రత్యుత్తరం వచ్చింది 'అమోఘమైన సలహా' యిచ్చినందుకు గోపీ నా పైన అభినందనలు గుప్పించాడు. కానీ వెలుతురు వెంట నీడలా ఈ అభినందనను వెన్నంటి అభిశంసనగూడా ప్రారంభమైంది. ఐతే ఆ అభిశంసన గోపీది కాదు. అది అక్కయ్య దగ్గరనుంచీ గోపీకి చేరింది. వాడు దాన్ని నాకు 'రీ డైరెక్ట్' చేశాడు!

"నీ సలహా ప్రకారం రెండు మూడేళ్ళ పాటు పెళ్ళి మాట తలపెట్టగూడదనుకున్నాను మామయ్యా! ఆ నిర్ణయాన్ని వెంటనే అమ్మకు తెలియజేశాను. అందుకామె దగ్గరనుంచీ వచ్చిన బదులు నన్ను విభ్రాంతిలో ముంచేసింది. 'ఒరేయ్ పిచ్చి గోపీ! నీ పాలిటికి తెల్లటివన్నీ పాలు, నల్లటివన్నీ నీళ్ళు. అసలు ఈ పెళ్ళి పెత్తనం మీ మామయ్యపైన పెట్టడం నా తప్పు. వాడి మనసులో ఏదో దురుద్దేశం మెదులుతోందన్న అనుమానమైతే నాకేనాటినుంచో కద్దు! ఈ రెండు మూడేళ్ళు ఎలాగైనా నీకు పెళ్ళి గాకుండానే గడచిపోతే అప్పటికి శారదకు పెళ్ళీడు వచ్చేస్తుందని వాడి ప్లాను. అమ్మో, మీ మామయ్యంటే ఏమనుకున్నావ్? వాడునీటిలో చేపకు ఈదడం నేర్పించగలడు? లేకపోతే వాడికేం పలుకే బంగారమా! మనసువిప్పి 'గోపీకి మన శారదనే చేసుకోవాలి అక్కయ్యా' అంటే నేను కాదంటానా! వాడి సంగతలా వుండనీ, ఆడపిల్లను కని యింట్లో పెట్టుకున్న మీ అత్తయ్యకంత బెట్టెందుకు? ఇంట్లో పిల్లలెవరూ లేరు. ప్రొద్దు గడవడం దుస్తరంగా వుంది. శారదను నా దగ్గరుంచుకుంటాను - అంటే మా బిడ్డ మాకేం బరువు లేదులే వదినా అంటుందా! ఎప్పుడైనా అక్కడికి రావలసిందిగదా - అంటే, అబ్బో, మహరాజులు మీరెక్కడ మేమెక్కడ అని నంగనాచితనం ఒలకబోస్తుందా! వాళ్లకు సరైన శాస్తి చేయాలనుకున్నాను. కానీ నువ్వెక్కడ! నువ్వూ వాళ్లలో చేరిపోయావు. నువ్వూ మీ మామయ్య మీ అత్తయ్య మీరందరూ ఒకటి. చివరకు నేనొకతెనే యిలా వేరుపడి పోయాను..."

జాబు నా చేతిలో వుండగానే వెనుక వైపున నిల్చుని ఆద్యంతాలూ సాకల్యంగా చదివి ముగించిన జానకి "ఐతే తల తిరిగి కబళం నోటిదగ్గరికే వస్తోంది కదండీ!" అంటూ సాగదీసింది.

"నిజమేగానీ ఆ కబళం అలా తల తిరిగి రావడానికి కారకులెవరో తెలుసా జానకీ" అన్నాను.

"ఎవరు? నేనుకదూ! అవున్లెండి! ఎలాగైనా మీరందరూ ఒకటి! నేనే వేరు..." అంటూ ఆ మాత్రానికే చీరచెంగు వెదుక్కోబోయింది జానకి!

అక్కడ అక్కయ్యా యిదేమాట! ఇక్కడ జానకీ యిదేమాట! వీళ్లు తమ అభిప్రాయాలేమిటో స్పష్టంగా తేల్చి చెప్పరు. ఏమిటో చేయాలనుకుంటారు. మరేమిటో చేస్తున్నట్లు అభినయిస్తారు. మనసు లోపలి మారుమూల గదిలో తమ కోరికలను గుప్తపరచుకుని తలుపుమూసి తాళంవేసి, ఆ తాళం చెవి మన చేతికి దొరకకుండా వుండడానికి ఎంత శ్రమ తీసుకోవాలో అంత శ్రమా తీసుకుంటారు. అక్కయ్య అయితేనేమి? జానకైతేనేమి? అసలు స్త్రీ ప్రకృతే అంత! అందుకుగాకపోతే ఈ మగవాళ్లు 'దేవోనజానాతి కుతో మనుష్యః' అని నెత్తిన చేతులు పెట్టుకుని విచారిస్తూ కూర్చోడం మరెందుకు?

❖ ఆంధ్రపత్రిక, - 20 జనవరి, 1961. ❖